www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 28 అక్టోబర్ 2025

5

పశ్చిమ గోదావరి



నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్‌టిసి ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్‌టిసి డిఎం ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ప్రజారవాణా సేవలు, కార్గో సేవలు, కార్గో డెలివరీ, విద్యార్థులకు రాయితీలు, బస్సులకు సంబంధించిన ఇబ్బందులు, విహారయాత్రలకు ప్రత్యేక బస్సులు, సలహాలు, సూచనలు, సిబ్బంది ప్రవర్తన, ప్రత్యేక బస్సుల ఫిర్యాదులుంటే 9959225486 నెంబర్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.



డిఎం సుబ్బన్న రెడ్డి

హై.. అలెర్ట్

- అన్నదాతకు 'మొంథా' గుబులు..
- తుపాను ప్రభావంతో కమ్ముకున్న ముసురు
- చివరి దశలో దాదాపు 4 లక్షల ఎకరాల్లో వరి పంట
- 90 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలుల హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- ఇప్పటికే రెండు జిల్లాల్లో దాదాపు ఐదు వేల ఎకరాల్లో పంట మునక
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- పునరావాస కేంద్రాలు, తుపాను సహాయక కేంద్రాలు ఏర్పాటు
- సోషల్‌మీడియా ద్వారా గ్రామాల్లో టాంటాం వేయిస్తూ ప్రజలకు అవగాహన
- జిలా ఇన్‌ఛార్జి మంత్రి, ప్రత్యేక అధికారులు వేర్వేరుగా అధికారులతో సమీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'మొంథా' తుపాను హెచ్చరికలతో అన్నదాత తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. తుపాను తీరం దాటే సమయంలో దాదాపు 90 నుంచి వంద కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. చేతివరకూ వచ్చిన పంట అందకుండా పోతోందన్న భయం మట్టి మనిషికి నిద్రలేకుండా చేస్తోంది. తుపాను ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఉదయం నుంచి ముసురు కమ్ముకుంది. వర్షం పడుతూనే ఉంది. మంగళవారం కాకినాడ వద్ద తుపాను తీరందాటనుందని వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే హెచ్చరికలు జారీ అయ్యాయి. అల్పపీడన ప్రభావంతో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలూరు జిల్లాలో 1,987 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2,900 ఎకరాలు మొత్తంగా దాదాపు ఐదు వేల ఎకరాల్లో వరి పంట ముంపుగురైన పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ పంట గింజ గట్టిపడడం, ఈనిక, పొట్టదశలో ఉంది. ఈ సమయంలో ఈదురుగాలులు వీస్తే పంటంతా నేలకొరిగే ప్రమాదం ఉంది. భారీ వర్షాలకు పంటంతా దెబ్బతినే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అదే విధంగా పత్తి రైతులు సైతం తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పత్తిసాగు ఎక్కువగా సాగుతోంది. ప్రస్తుతం పత్తి పంట కోత దశలో ఉంది. తీసిన పంట వర్షాలకు తడిసిపోతుండడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగే పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయాధికారులు వర్షం, గాలులు వస్తే పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. పొలాల్లో ముందుగానే బోదెలు తీసుకుని వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వరిపైరు నేలకొరిగితే ఉప్పునీరు పిచికారీ చేయడం వంటి పలు అంశాలను రైతులకు చెబుతున్నారు. తుపాను తీరందాటే సమయంలో గాలులు వీస్తే మాత్రం రెండు జిల్లాల్లో తీవ్ర పంట నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. పంటలు బాగా ఉన్నాయని అంతా సంతోషంగా ఉన్నారు. ఈ తరుణంలో మొంథా తుపాను ఆరుగాలం పడిన కష్టాన్ని ఛిద్రం చేస్తున్న భయం రైతులను వెంటాడుతోంది.



ఉంగుటూరు మండలంలో పక్వానికి చేరిన వరి పంట



అధికారులు అప్రమత్తం..

తుపాను హెచ్చరికల నేపథ్యంలో రెండు జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలకు నియమించిన ప్రత్యేకాధికారులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పర్యటించి తీసుకున్న చర్యలను పరిశీలిస్తున్నారు. రెండు జిల్లాలో ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లాలో తీర ప్రాంతం ఎక్కువగా ఉండడంతో తుపాను తీవ్రత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగా 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. అంతేకాకుండా 26 పక్కా భవనాలను ముందుగానే సిద్ధం చేసి ఉంచారు. 36 ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంచేశారు. ఏలూరు జిల్లాలో 11 లంక గ్రామాలపై తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని గుర్తించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. 82 తుపాను సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోషల్‌మీడియాతో పాటు గ్రామాల్లో టాంటాం వేయిస్తూ తుపానుకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ముందస్తుగా చర్యలను పర్యవేక్షిస్తున్నారు. రాత్రికి వర్షం జోరు మరింత పెరిగే అవకాశం ఉండడంతో తుపాను ప్రభావం తీవ్రంగా ఉండనున్నట్లు అంచనా వేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుపాను పర్యవేక్షణ జిల్లా ప్రత్యేకాధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - నరసాపురం

తుపాన్ పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుపాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం నరసాపురం నియోజకవర్గం తీర ప్రాంత గ్రామాలైన పెదమైనవానిలంక, వేములదీవి, బియ్యపుతిప్ప, చినమైనవానిలంక, పాతపాడు, కెపి.పాలెం గ్రామాల్లో జిల్లా ప్రత్యేకాధికారి ప్రసన్న వెంకటేష్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి తుపాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. సముద్ర అలల ఉధృతిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైతే పరిస్థితిని బట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తీసుకెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు భోజన వసతితోపాటు తాగునీరు, టాయిలెట్స్, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల సిబ్బంది ఎటువంటి విపత్తు సంభవించినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్స్యకారులు సముద్రంలోకి, ఉప్పుటేరులోకి వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. తీరంలో అగ్నిమాపక, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ దాసి రాజు మండలంలోని వేములదీవి పడమర, చినమైన వానిలంకలో శిథిలావస్థలో ఉన్న సబ్‌ట్రెక్ వంతెనను పరిశీలించారు. వారి వెంట తహశీల్దార్లు ఐతం సత్యనారాయణ, రాజ్ కిషోర్, కనకరాజు, ఎంపిడిఒ పాజిల్, సిబ్బంది ఉన్నారు.



పునరావాస కేంద్రాలను ప్రసన్న వెంకటేష్, జెసి రాహుల్ కుమార్ రెడ్డి

మొగల్తూరు : తుపాన్ పట్ల అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు అప్రమత్తం చేయాలని తుపాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో సిఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. తరువాత తీర ప్రాంత గ్రామాలు పాతపాడు, కెపి.పాలెం, పేరుపాలెం గ్రామాల్లో జెసి రాహుల్‌కుమార్ రెడ్డితో కలిసి ప్రసన్న వెంకటేష్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. తుపాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలు, తీర ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. తీర ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు.వారి వెంట ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ కె.రాజు, కిషోర్, పోలీస్ శాఖ, సిబ్బంది ఉన్నారు.

'మొంథా'పై నిరంతర పర్యవేక్షణ

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మొంథా తుపానుపై నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. తుపాన్‌ను ఎదుర్కొనేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురియనున్న దృష్ట్యా కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డివిజనల్, మండల స్థాయి కంట్రోల్ రూమ్ నుండి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పల్లపు ప్రాంతాలు ముంపునకు గురి కావడం, చెట్లు పడిపోవడం, నిత్యావసర వస్తువుల కొరత, విద్యుత్ అంతరాయాలు, పునరావాస కేంద్రాల వద్ద తాగునీరు, శానిటేషన్, వైద్య సహాయం తదితర సమస్యలపై ఫిర్యాదులు వస్తే తక్షణం స్పందించి సంబంధిత సమాచారాన్ని ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమస్య వస్తే ప్రజలు కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 08816 299219 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.శివనారాయణ రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి పాల్గొన్నారు.



యనమదుర్రు డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

తుపాన్ తీరం దాటే సమయానికి జిల్లా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. తుపాన్ నేపథ్యంలో జిల్లాలో పలు ప్రాంతాలను జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. మెంటేవారితోటలోని మినామికోడు మురుగు కాలువ వద్ద షట్టర్లను, నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. యనమదుర్రు డ్రెయిన్ బ్రిడ్జిపై నుండి ప్రవాహ వేగాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు. గట్లు బలహీనంగా ఉన్నచోట్ల ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బ్యాంక్ కాలనీ, బిఎంకె రైస్‌మిల్ ప్రాంతంలో యనమదుర్రు కట్ట ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. దుర్గాపురంలో వర్షపు నీరు ఎక్కువగా వస్తే పునరావాస కేంద్రానికి తరలించేందుకు భీమవరంలో కూడా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒను ఆదేశించారు. భీమవరం రూరల్‌లో మూడు, కాళ్లలో ఒకటి, ఆకివీడులో ఒకటి, భీమవరం టౌన్‌లో ఒకటి మొత్తం ఆరు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 36 మందితో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం కూడా జిల్లాకు వచ్చిందన్నారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ కార్తీక స్నానాలకు ఎవరు సముద్రం, నదీ ప్రాంతాలకు వెళ్లొదని తెలిపారు. వారి వెంట ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి సత్యనారాయణ, ఎఇ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ మున్సిపల్ కమిషనర్ బి.రాంబాబు ఉన్నారు.

జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు

16 పునరావాస కేంద్రాలు ,26 పక్కా భవనాలు సిద్ధం

కోస్తా జిల్లాల తుపాన్ ప్రత్యేక పర్యవేక్షకులు ఆర్‌పి.సిసోడియా

ప్రజాశక్తి - భీమవరం

మొంథా తుపాను కాకినాడకు 500 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం అయ్యిందని మంగళవారం రాత్రికి కాకినాడ మచిలీపట్నానికి మధ్య తీరం దాటే అవకాశం ఉందని రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కోస్తా జిల్లాల తుపాన్ ప్రత్యేక పర్యవేక్షకులు ఆర్‌పి.సిసోడియా అన్నారు. సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ప్రత్యేకాధికారి ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మితో కలిసి తుపాన్ పరిస్థితులపై సిసోడియా సంయుక్తంగా సమీక్షించి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుపాన్ సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా కీలకమైందని, కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉంటే నష్టాన్ని చాలా వరకూ తగ్గించుకోవచ్చన్నారు. జిల్లాలో 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు, 26 పక్కా భవనాలను పునరావాస కేంద్రాల నిర్వహణకు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఒక ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం నరసాపురంలో సిద్ధంగా ఉందన్నారు. 68 జెసిబిలు, 57 పవర్ సాసర్లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. మంగళవారం సాయంత్రం రోడ్లమీద ప్రయివేటు వాహనాలు తిరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పికి ఆదేశాలు జారీ చేశారు.



కలెక్టర్, ఎస్‌పితో మాట్లాడుతున్న సిసోడియా

ఎడతెరిపి లేని వర్షం.. రహదారులు జలమయం



మొగల్తూరులోని కోట రోడ్డులో నిలిచిన వర్షం నీరు

ప్రజాశక్తి - మొగల్తూరు

తుపాను ప్రభావంతో ఉదయం నుండి రాత్రి వరకు ఎడ తెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మొగల్తూరు వెంప, మొగల్తూరు సిరియా పాలెం వెళ్ల రహదారులు ధ్వంసమై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో వర్షం నీరు నిలిచి వాహనచోదకులు, ప్రజల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరులోని సాలిపేట ముక్కువారి వీధి, సత్తెమ్మ గుడివీధి, వారతిప్ప, ముత్యాలపల్లి, కాణిపాకం, పాతపాడు తదితర గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారిపైన వర్షం నీరు నిలిచిపోయింది. మొగల్తూరులోని హై స్కూల్ జలమయమైంది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో వ్యాపారాలు నిలిచిపోయాయి.

ఆచంట : మొంథా తుపాన్ ప్రభావంతో మండలంలో సోమవారం ఉదయం నుంచి మోస్తారుగా వర్షం కురుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తుపాను రైతుల కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రకృతి కనికరిస్తే తప్ప ఏమీ చేయలేని స్థితిలో అన్నదాతలు ఉన్నారు.



ఆచంటలో కురుస్తున్న వర్షం

పెనుమంట్ర : ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి, ఈదురుగాలులకు మార్టేరు నుండి పెనుగొండ పరిధిలోని నరసాపురం - నిడదవోలు రోడ్డులో చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ దుకాణాలు మూసి ఉండడం, అటుగా వాహనాలు రాకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

గణపవరం : మొంథా తుపాను ప్రభావం వల్ల గణపవరంలో సోమవారం ఉదయం నుండి చలిగాలులు, చిన్నపాటి వర్షం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తుపాను వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మండలాధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. రాత్రికి తుపాను ఉధృతి పెరగనుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వల్ల జనం బయటకు రాకుండా ఇళ్లవద్దనే ఉన్నారు. వరిసాగు రైతులు ఇబ్బందుల్లో పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెనుమంట్రలో నరసాపురం-నిడదవోలు రోడ్డులో విరిగిపడిన చెట్టు కొమ్మలు

పాలకొల్లు : ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తుపాన్ ప్రభావంతో పాలకొల్లులో తేలికపాటి వర్షం కురుస్తోంది. సాయంత్రం నుంచి చినుకులు ప్రభావం తగ్గింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తుపాన్ ప్రభావంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ఈనిక, పాలు పోసుకునే దశలో ఉన్న పంట పొలాలకు ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచు కొస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంట పొలాలపై భారీగా పెట్టుబడులు పెట్టిన అన్నదాతల గుండెల్లో రైలు పరిగెత్తుతున్నాయి. ప్రకృతి కనికరిస్తే తప్ప ఏమీ చేయలేని స్థితిలో అన్నదాతలు ఉన్నారు.

పాలకొల్లులో నీటమునిగిన వరి పొలం



పొంగి పొర్లుతున్న పాత వయ్యేరు

ఇళ్లలోకి నీరు వస్తే చెంచులను ఖాళీ చేయిస్తాం

జిల్లా పరిషత్ హైస్కూల్లో పునరావాసం

ఆకివీడు : భారీ వర్షాల ప్రభావంతో చినకాపవరం నుండి అప్పారావుపేట, కోళ్లపర్రు, ఆకివీడు సమతానగర్ మీదుగా ఉప్పుటేరులో కలిసే ఓల్డ్ వయ్యేరు కాలువ పొంగి పొర్లుతోంది. స్థానిక సమతా నగర్ వద్ద కాలువ గట్టు దాటి నీరు పొంగడంతో అక్కడ నివసిస్తున్న చెంచుల కాలనీకి ప్రవేశించింది. కాలనీ రోడ్లపై ఇప్పటికే అడుగున్నర పైన నీరు నిలిచి ఉంది. మెరకవీధుల్లో సుమారు రెండు అంగుళాల నీరు నిలిచింది. అయితే మరో అడుగు నీరు పెరిగినట్టు అయితే ఇళ్లల్లోకి నీరు ప్రవేశించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులలో అధికారులు రంగ ప్రవేశం చేశారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఫరూక్, ఆర్‌ఐ ఆంజనేయులు అక్కడ నివసిస్తున్న చెంచులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కార్యక్రమాలు ప్రారంభించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈమేరకు అక్కడ ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు.

ఓల్డ్ వయ్యేరును పరిశీలిస్తున్న ఎంఆర్‌ఒ, ఆర్‌ఐ



తీరంలో అలజడి

- ఎగిసిపడుతున్న సముద్రపు అలలు
- పిఎం లంకలో పది మీటర్ల మేర ముందుకొచ్చిన సముద్రం
- ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు



పెదమైనవాని లంకలో ఎగిసిపడుతున్న సముద్ర అలలు

ప్రజాశక్తి - నరసాపురం

తుపాన్ కాకినాడ సమీపంలో తీరం దాటే సమయంలో ఎలాంటి విపత్తు సృష్టిస్తుందోనని తీర ప్రాంతం వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటు తుపాన్ ప్రభావంతో సోమవారం మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. బలమైన ఈదరు గాలులు వీశాయి. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. ఇటు సముద్ర అలలు ఎగిసిపడుతున్నాయి. పిఎంలంక వద్ద పది మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. తుపాన్ తీరానికి సమీపిస్తున్న కొలది సముద్రం మరింత కల్లోలంగా మారే అవకాశం ఉండటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చినమైనవాని లంక, పెదమైనవాని లంక, బియ్యపుతిప్ప గ్రామాలకు చెందిన మత్యకారులు బోట్లు, పడవల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. తీరంలో పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్, మెరైన్ పోలీసులు బీచ్‌లో గస్తీ కాస్తున్నారు. ప్రస్తుతం నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో సుమారు 15 వేల మందిని తరలించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. తుపాన్ తీవ్రతను గ్రామస్థాయి సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రచారం తెలియజేస్తున్నారు. మంగళ, బుధవారాల్లో కచ్చితంగా ఇళ్ల నుంచి పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచిస్తున్నారు. ప్రతి కేంద్రం వద్ద ఒక స్పెషల్ అధికారిని నియమించారు. తీరంలో ఏర్పాటు చేసిన అన్ని పునరావాస కేంద్రాలను జెసి పరిశీలించి మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు తూపాన్‌ను సమర్థవంతగా ఎదుర్కొందుకు సిద్ధంగా ఉండాలన్నారు.



వేములదీవిలోని పునరావాస కేంద్రం

సిఐటియు జిల్లా మహాసభ వాయిదా

తుపాన్ నేపథ్యంలో నిర్ణయం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 28, 29వ తేదీల్లో పెనుగొండలో నిర్వహించనున్న సిఐటియు 13వ జిల్లా మహాసభను వాయిదా వేస్తున్నట్లు సిఐటియు జిల్లా కమిటీ ప్రకటించింది. మొంథా తుపాన్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో సిఐటియు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను కారణంగా మహాసభను వాయిదా వేసినట్లు తెలిపారు. సిఐటియు, కార్మికులు, కార్యకర్తలు తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది. తుపాన్ వల్ల తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మహాసభకు సహకరిస్తున్న పెనుగొండ వర్తక వ్యాపార సంస్థలకు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. వాయిదా వేసిన మహాసభను త్వరలోనే పెనుగొండలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.


నీటమునిగిన కాలనీ

రహదారిపై నిలిచిన వర్షపు నీరు

తొలగించాలని స్థానికుల వేడుకోలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాలలో తుపాను ప్రభావంతో గత వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీరు కొద్దికొద్దిగా బయటకు వెళ్ల సాగింది. రహదారిపై నిలిచిన వర్షం నీరు బయటకు వెళ్లేందుకు గ్రామంలో పక్కా డ్రెయినేజీ లేకపోవడంతో రహదారిపై నిలిచిపోయింది. దీంతో స్థానికులు రహదారి పైనుంచి వచ్చిన వర్షం నీరు బయటకు వెళ్లేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రహదారులపై, ఇళ్ల పరిసరాల్లో నిలిచిన నీటిని బయటకు వెళ్లేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నీరు పరిసరాల్లో నిలిచి నిల్వ ఉండటంతో అంటువ్యాధులు ప్రబలి రోగాల బారిన పడతామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


డ్రెయిన్‌లో అడ్డంకులు తొలగిస్తున్న అధికారులు

బొండాడ డ్రెయిన్‌లో అవరోధాల తొలగింపు

ప్రజాశక్తి - ఉండి

రాబోయే మూడు రోజులు మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో స్థానిక ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు బొండాడ డ్రెయిన్‌లో అవరోధాల తొలగింపు కార్యక్రమంలో మురుగు పారుదల శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. మండలంలోని వాండ్రం వద్ద బొండాడ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూడు ఎక్కువగా మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో డ్రెయిన్ జెఇ సోమిశెట్టి జయ ప్రకాష్ ఆధ్వర్యాన సిబ్బంది వాటిని తొలగించారు.


శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

ఆరుగురికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

ప్రజాశక్తి - పోడూరు

పోడూరు పిహెచ్‌సిలో సోమవారం ఆరుగురు మహిళలకు కుటుంబ నియంత్రణ చికిత్సలు నిర్వహించారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఒ వి.ప్రసాద్ స్థానిక మెడికల్ ఆఫీసర్ వి.సుప్రజ శస్త్ర చికిత్స చేశారన్నారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ప్రసాద్ మాట్లాడుతూ పిహెచ్‌సిలో కుటుంబ నియంత్రణ చికిత్స చేయించుకునే మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. శస్త్ర చికిత్సల నిర్వహణలో సిబ్బంది సేవలు ఉపయోగించారు.

మానవ వనరుల కమిటీ ఉపాధ్యక్షుడిగా కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు గ్రామానికి చెందిన యువకుడు చిర్ల కృష్ణారెడ్డికి రాష్ట్ర మానవ వనరుల కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ బోర్డ్ అడ్మినిస్ట్రేటర్ బివిఎల్.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ నియామకం పట్ల పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి న్యాయం చేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచిన కౌన్సిల్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


విజయవాడ వెళ్తున్న ఉద్యోగులు

విజయవాడకు తరలిన ఉద్యోగులు

నరసాపురం : న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ సోమవారం సహకార సంఘాల ఉద్యోగులు విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఉదయం నరసాపురం రైల్వేస్టేషన్ డివిజన్ పరిధిలోని సొసైటీల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో వెళ్లారు. అక్కడ నుంచి నేరుగా విజయవాడ ఆప్కాబ్ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు బయలుదేరి వెళ్లారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సొసైటీలు బంద్ చేసి ఆందోళనలో పాల్గొనేందుకు తరలివెళ్లారు.

అంగన్వాడీ ఆయాల భర్తీకి దరఖాస్తులు

ఆకివీడు : ఐసిడిఎస్ ఆకివీడు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయాల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి పి.వాణి విజయరత్నం తెలిపారు. పేటబొండాడ పేట 2, ఎస్‌ఆర్‌ అగ్రహారం 1, క్రాప్ 5, మహదేవపట్నం 3, 7, విస్సాకోడేరు 7, ఆకివీడు 16, పెద్దపేట ఒకటి, మోగల్లు 2, పెద్దఅమిరం ఒకటి, మోగల్లు 2 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. రిజర్వేషన్ విధానంలో ఆయాల పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆయా గ్రామాలలో స్థానికులైన మహిళలు, 30 సంవత్సరాల లోపు ఉండి, కనీసం ఏడో తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. ఈనెల 28వ తేదీ నుండి నవంబర్ ఐదవ తేదీలోగా అర్హులైన వారి దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయవచ్చునని తెలిపారు.

మంత్రి నిమ్మల అసత్య ఆరోపణలు తగవు : వైసిపి

పాలకొల్లు : గత వైసిపి హయాంలో తట్టముట్టి గాని, బస్తా సిమెంట్ గాని వేయలేదని మంత్రి నిమ్మల రామానాయుడు తరచూ ఆరోపణలు చేస్తున్నారని, అయితే ఇదే నియోజకవర్గంలో 250 సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం ఎవరు చేశారని పాలకొల్లు వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ ప్రశ్నించారు. ఈమేరకు వైసిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసిపి హయాంలో జరిగిన అభివృద్ధిని తన అభివృద్ధిగా మంత్రి చిత్రీకరిస్తున్నారని చెప్పారు. పట్టణ వైసిపి అధ్యక్షులు కోరాడ శ్రీనివాస్, వైసిపి నేతలు మద్దా చంద్రకళ పాల్గొన్నారు.

వసతి గృహాలు.. కానరాని సౌకర్యాలు..!

- వర్షం నీరు నిల్వ.. దోమల ఉధృతి
- బెడ్స్ లేక కటిక నేలపైనే నిద్ర
- ఇది వల్లూరు సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహం దుస్థితి


స్లాబ్ పైనుంచి కారుతున్న వర్షం

సంక్షేమ వసతి గృహాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. అరకొర సౌకర్యాలతో సతమతమవుతున్నా.. నేతల హామీలు తమ రాత మార్చడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. శిథిల నీడలో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్న వీరి సంక్షేమానికి కేటాయిస్తున్న అరకొర నిధులు పూర్తిస్థాయిలో సమస్యలను పరిష్కరించలేకపోతున్నాయి. మం డలంలోని వల్లూరు సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో ప్రజాశక్తి పరిశీలించగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వం స్పందించి సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.


ప్రహరీ గోడ పక్కన నిల్వ ఉన్న వర్షపు నీరు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో ఇప్పటికే 9 వసతి గృహాలను మూసివేశారు. ప్రస్తుతం వల్లూరు సోషల్ వెల్ఫేర్ వసతి గృహంలో 25 మంది బాలికలు అడ్మిషన్లు పొందారు. ప్రస్తుతం వసతిగృహంలో 15 మంది మాత్రమే ఉన్నారు. బాలికల వసతి గృహంలో భవనం పరిస్థితి అధ్వానంగా ఉంది. పై కప్పు నుంచి వర్షపు నీరు బాలికలు పడుకునే గదిలో పడుతుండటంతో విద్యార్థులు నీటి కింద తల దాల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వసతిగృహంలో 3 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న 25 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వంటశాల కూడా సరిగా లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి ప్రాంగణం పల్లంగా ఉండడంతో మురుగు నీరు నిలవ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ వసతి గృహం ముందు పంచాయతీకి సంబంధించిన చెరువు ఉండటంతో వర్షపు నీరు బయటకు వెళ్లక వసతి గృహం వరండాలో తిష్టవేస్తుంది. సంక్షేమ హాస్టళ్లను సక్రమంగా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో క్రమ క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది. విశాలమైన భవనం ఉన్నా.. లోన లొటారం, బయట పటారం అన్న చందంగా మారింది.

ప్రజాశక్తి పరిశీలన

కటిక నేలపైనే కునుకు..

వల్లూరు సోషల్ వెల్ఫేర్ వసతి గృహంలో బాలికలు నిద్రించడానికి కనీసం బెడ్స్ లేని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇచ్చిన జుమ్మా కణాలు నేల మీద పరిచి వాటిపై పడుకుంటున్నారు. దీంతో విద్యార్థులపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి.

కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి..

ప్రభుత్వ వసతి గృహాల్లో పేద విద్యార్థులకు అందించే కాస్మోటిక్ ఛార్జీలు ఏళ్ల తరబడి పెంచకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ధరలతో పోలిస్తే పావువంతు కూడా ప్రభుత్వం అందించడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

పంచాయతీ చెరువు వల్ల ఇబ్బంది పడుతున్నాం

కెవి.నర్సమ్మ, హాస్టల్ వార్డెన్, వల్లూరు

సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ముందు పంచాయతీ చెరువు ఉండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమస్యను ఉన్నతాధికారులకు వివరించాము. 3 నుంచి ఆరో తరగతి వరకు నెలకు ఒక విద్యార్థికి రూ.130, 7వ తరగతి నుంచి తొమ్మిదో తరగతి ఒక విద్యార్థికి రూ.200 విద్యార్థుల తల్లి అకౌంట్లోకి ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ విద్యా సంవత్సరానికి ఇంకా కాస్మోటిక్ ఛార్జీలు ప్రభుత్వం చెల్లించలేదు. బాలికలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం.


నేల మీద కూర్చున్న విద్యార్థులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- తాగునీరు, విద్యుత్ సౌకర్యాల పట్ల పర్యవేక్షణ
- రైతులు నష్టపోకుండా ముందస్తు చర్యలు
- రాష్ట్ర విప్‌లు బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్


ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నియోజకవర్గంలోని ప్రభుత్వ శాఖల అధికారులందరూ మొంథా తుపాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు ఎల్లవేళలా ఒకేవిధంగా ఉండవని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాన్ గాలులు, వర్షపాతం అధికంగా ఉన్న ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేయాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల పట్ల ఎల్లవేళలా పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్స్‌ను ప్రజలందరూ సంప్రదించేందుకు అధికారులు ప్రజల్లో ప్రచారం చేయాలని తెలిపారు. అనంతరం ఆయన నందమూరి గ్రామంలోని అక్రిడేటెడ్ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లోని రైతులు నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కూటమి నాయకులు స్వచ్ఛందంగా ప్రజలందరినీ అప్రమత్తం చేయాలని ఆయన కోరారు. అధికారులు ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాలలో పర్యవేక్షణ నిర్వహించి, రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ బాబు, ఇరిగేషన్ డిఇ కె.ధర్మజ్యోతి, తాడేపల్లిగూడెం తహశీల్దార్ సునీల్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం : తుపాన్ ప్రభావంతో తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయని, అన్ని శాఖలు అలర్ట్‌లో ఉన్నాయని, పరిస్థితిని దగ్గరగా పర్యవేక్షిస్తున్నామని వారు పేర్కొన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదని, విద్యుత్ స్తంభాలు, వైర్ల దగ్గర జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని మండలంలోని పెదమైనవానిలంక, బియ్యపుతిప్ప, చినలంక గ్రామాలలో తుపాన్ షెల్టర్లను సందర్శించి, ప్రజలతో మాట్లాడి అవసరమైన సహాయం అందించేందుకు అధికారులను ఆదేశించారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, పిల్లలు, వృద్ధులు ఇంట్లోనే ఉండాలని ప్రజలను కోరారు. ప్రజల భద్రతే ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నాయకర్, రామరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు.


పిఎం లంక గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న నాయకర్

తణుకు : నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ హెచ్చరించారు. తణుకులో ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో తుపాను తీరం దాటే అవకాశం ఉన్నందున తణుకులో 20 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తణుకు నియోజకవర్గంలో విద్యుత్తు, నీటి సరఫరా, టెలి కమ్యూనికేషన్ ఆటంకాలు లేకుండా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. ఇప్పటికే తణుకు పరిసర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని సహాయ పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. అధికారులు, కూటమి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇబ్బందులు ఏమైనా ఉంటే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.


వీరవాసరం: రైతులకు సూచనలు చేస్తున్న ఎఇ

వీరవాసరం : తుపాన్ నేపథ్యంలో మండలంలో అధికారులు అప్రమత్తమయ్యారు. వీరవాసరం, తోలేరు, కొణితివాడ, రాయకుదురు గ్రామాలలో జిల్లా పరిషత్ పాఠశాలలో ముందస్తు సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈమేరకు ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుని పర్యవేక్షిస్తున్నట్లు తహశీల్దార్ ఎంవి.రామాంజనేయులు సోమవారం తెలిపారు. తుపాన్ వల్ల వరిచేలు దెబ్బతినకుండా తీసుకోవలసిన చర్యలపై మండల వ్యవసాయాధికారి బిన్నీబాబు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు ముందస్తు సూచనలు చేశారు. వ్యవసాయ సహాయకులతో గ్రామాలో రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందే విధంగా వారి పేర్లు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని పరిస్థితులను ఎదుర్కోనే విధంగా, విద్యుత్‌కు అంతరాయలేకుండా తీసుకోవడానికి ఒక ప్రణాళిక ప్రకారం సిద్ధంగా ఉన్నామని ట్రాన్స్‌కో ఎఇ అప్పారావు తెలిపారు. తుఫాన్ వల్ల నేలకొరిగిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేసేందుకు ముప్పై విద్యుత్ స్తంభాలు, అవసరమైన 2 వేల మీటర్లు పొడవు కరెంటు తీగలు, అదనంగా రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఆచంట : మొంథా తుఫాన్ ప్రభావంతో ఇప్పటికే ఎడ తెరిపిలేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా హోర్డింగులు గాలికి కూలిపోయే పరిస్థితి లేకుండా కార్యదర్శులు ముందుగానే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రాణ నష్టం, జంతు నష్టం, సాధమైన మేరకు ఆస్తి నష్టం లేకుండా తగు సూచనలు మైక్ అనౌన్స్ మెంట్, చిన్న చిన్న అవగాహనా సమావేశాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. వాట్సప్ గ్రూపులు, సోషల్ మీడియా ద్వారా కూడా ఎప్పటికప్పుడు ప్రజలకు వాస్తవ పరిస్థితి తెలియజేస్తూ వదంతులు నమ్మవద్దని, ఆత్మస్థైర్యంతో ఎటువంటి పరిస్థితులనైనా సమర్ధవంతంగా ఎదుర్కొనేలా సమాయత్తం కావాలన్నారు. పంచాయతీ కార్యాలయాల్లో విద్యుత్, నెట్ సదుపాయాలకు అంతరాయం కలగకుండా మినీ జనరేటర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, తాగునీరు వంటివి అందుబాటులో ఉంచుకోవాలని, గ్రామాల్లో ఎటువంటి సంఘటన జరిగినా వెంటనే పైఅధికారులకు తెలియజేయాలని, షిఫ్ట్ పద్ధతిలో తుపాన్ హెచ్చరిక ఉపసంహరించే వరకు పంచాయతీ ఆఫీసుల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, రెవెన్యూ, విద్యుత్, ఆరోగ్య శాఖల వారి సమన్వయంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎఒ వి.పూర్ణ బాబ్జి, ఇఒపిఆర్‌డి కె.బులి సూరన్న, నాగిరెడ్డి, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని 18 గ్రామాలకు తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రత్యేక అధికారులను నియమించి, అన్ని ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో పర్యవేక్షిస్తున్నట్టు స్థానిక ఎంపిడిఒ ఎన్‌ఎన్‌జె.కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం ఉదయం నెగ్గిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, గ్రామ పంచాయతీ సభ్యులతో తుపాన్ నుండి ఎలా రక్షణ పొందాలన్న విషయం మీద అందరికి సూచనలు చేశారు. అధిక వర్షాలకు పాత, పాడు బడిన గృహాలు కూలిపోయే ప్రమాదం ఉన్నందున వాటిని ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వల్లభు రాంబాబు, గ్రామ ఉపసర్పంచి అల్లం బాలసాయి రెడ్డి, కార్యదర్శి గుత్తికొండ వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.


కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు : ఆర్‌డిఒ

నరసాపురం : తుపాను ప్రభావంతో ప్రజలకు సహాయం అందించేందుకు నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రతి మండలంలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డిఒ దాసి రాజు తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రజలు కంట్రోల్ రూములను సంప్రదించాలని కోరారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం: 93911 85874, నరసాపురం 90106 78792, మొగల్తూరు 77022 79299, పాలకొల్లు 73962 31927, యలమంచిలి 9951578075, ఆచంట 95038 16459, పెనుగొండ 99519 60882, పెనుమంట్ర 99123 18573 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. పర్యాటక ప్రదేశాల సందర్శన తాత్కాలికంగా మానుకోవాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకుని ముందుగానే ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలిరావాలని సూచించారు. నియోజకవర్గంలో 16 తుపాను రక్షిత భవనాలను పునరావాస కేంద్రాలుగా వినియోగించేందుకు సిద్ధం చేశామన్నారు. తీరప్రాంత ప్రజలు సముద్రతీరానికి సమీపంలో ఉండొద్దని ఆర్‌డిఒ సూచించారు.

హాస్టల్ విద్యార్థులను తరలిస్తున్న అధికారులు


హాస్టల్ విద్యార్థుల తరలింపు

పెనుగొండ : కాకినాడ తీరానికి తుపానుగా మారనున్న తీవ్రవాయుగుండం ప్రభావంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పెనుగొండ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల(బాలికల) సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులను ముందస్తుగా ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోని హాస్టల్లోకి తరలించారు. దూర ప్రాంతాల నుండి ఉన్న విద్యార్థులను 169 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు ప్రిన్సిపల్ సుభాషిని తెలిపారు. సోమవారం రెవెన్యూ సిబ్బంది, ఎండిఒ సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, భోజనాలు, కరెంటు, తాగునీరు అందజేయాలని, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటామని ప్రిన్సిపల్‌కు భరోసా ఇచ్చారు. ఎస్‌ఐ గంగాధర్ దగ్గరుండి విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, విఆర్‌ఒ సతీష్, నాగరాజు, కవిత, ఎస్తేర్, సిబ్బంది పాల్గొన్నారు.


ఎమర్జెన్సీ వాహనాన్ని పరిశీలిస్తున్న జెసి

రెండు ఎమర్జెన్సీ వాహనాల ఏర్పాటు

పాలకొల్లు : తుపాన్ నేపథ్యంలో ప్రజలు ఆపదలో ఉన్నట్లయితే వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుగాను ఎమర్జెన్సీ రిస్క్ టీంలు రెండు వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ వాహనాలు పాలకొల్లు పట్టణంలోని అన్ని వార్డుల్లో పర్యవేక్షించడానికి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు, రాత్రి పది గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మూడు బృందాలుగా ఏర్పడి 24/7 పెట్రోలింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఏ సమయంలోనైనా ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలిగినా వాహనంలో పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. పాలకొల్లు పట్టణం 10, 11 వార్డులు సంబంధించిన సచివాలయాన్ని సందర్శించారు. వార్డు ప్లాన్‌లను పరిశీలించారు. పట్టణంలో మురుగునీరు ప్రవహించే దమయంతి మెయిన్ డ్రెయిన్ పరిశీలించారు. డ్రెయిన్‌లో ఏవిధమైన ఆటంకాలు లేకుండా మురుగునీరు పారుదల సక్రమంగా ఉండటంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి వర్షపాతం పరిమాణాన్ని తెలిపే సాధనమును పరిశీలించారు. వర్షపాతం ఎంత నమోదైనది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, మున్సిపల్ కమిషనర్ కె.విజయ సారథి, సిబ్బంది ఉన్నారు.

సహాయక చర్యల్లో పాల్గొనండి

మండల ప్రత్యేకాధికారి, జిల్లా కోఆపరేటివ్ అధికారి మురళీకృష్ణ

ఉండి : మొంథా తుఫాను ప్రభావంతో వచ్చే మూడు రోజులు వర్ష ప్రభావం అధికంగా ఉంటుందని, దీనివల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ, అవసరమైన చోట సహాయక చర్యల్లో ప్రభుత్వంచే నియమించబడ్డ నోడల్ అధికారులు పాల్గొనాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎస్.మురళీకృష్ణ అన్నారు. సోమవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో నోడల్ అధికారులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్య, డ్రెయినేజీ సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు చూడాలన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి అందించేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో మమేకమవ్వాలన్నారు. ఈ మూడు రోజులు గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల్లో నోడల్ అధికారులు పూర్తి బాధ్యతతో మెలగాలని, జిల్లా కలెక్టర్ ఆదేశాలానుసారం ప్రతి సచివాలయంలోనూ మూడు షిఫ్ట్‌లుగా సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మండల తహశీల్దార్ కావడి నాగార్జున, ఎంపిడిఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట

ఆచంట: కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలు యాత్రికులతో కిటకిటలాడాయి. ప్రసిద్ధిగాంచిన ఆచంట రామేశ్వర స్వామి ఆలయం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులతో కిక్కిరిసింది. కొలనులో యాత్రికులు కార్తీకదీపాలు వదిలారు. కొడమంచిలి సర్వేశ్వర స్వామి, పెదమల్లంలోని రామేశ్వరుడు, వల్లూరులోని పుష్పేశ్వరుడు, ఆచంట వేమవరంలోని సోమేశ్వర ఆలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణ, తదితరులు పర్యవేక్షించారు.

మొగల్తూరు : కార్తీకమాసం మొదటి సోమవారం మండలంలోని గ్రామాల్లో ఉన్న శివాలయాలు యాత్రికులతో కళకళలాడాయి. మండల కేంద్రం మొగల్తూరులోని పురాతన పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, వడయార్ పేటలోని స్వయంభూలింగేశ్వర వనమల్లిఖార్జుని ఆలయం, కాళీపట్నంలోని భద్రకాళి సమేత కాళికేశ్వరస్వామి ఆలయం, ముత్యాలపల్లిలోని భువనేశ్వరీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయం, పేరుపాలెం, కొత్తపాలెం